# ఆరోహక గీతం

## (The song of the Ascent)

జైలు గోడల మధ్య కాలం గడ్డకట్టుకుపోయింది. దేశంపై కమ్ముకున్న ఎడర్జెన్సీ చీకటి ఎత్తయిన ఆ జైలు గోడలమధ్యన మరింత చిక్కగా వుంది. రాత్రి ఎనిమిది గంటలు.

సన్నగా వాన కురుస్తుంది.

వరండాకు అమర్చిన ఆస్‌బెస్టాస్ చూరునుండి వర్షం దారాలు దారాలుగా క్రిందికి దిగుతోంది. అసలే నిరుత్సాహ వాతావరణం. దానికి తోడు ముసుర్లు. కురుస్తున్న వాన ఆ నిరుత్సాహ వాతావరణాన్ని మరింత ఇనుమడింపచేస్తోంది.

లేచి డైనింగ్ హాలువైపు నడిచాను. జైల్లో రాత్రివేళ భోజనం ఒక పని, కార్యక్రమం. ఆ పని అయిపోతే ఆవేళ కార్యక్రమం ముగిసినట్లే. ఆ తరువాత లాకప్. లాకప్ చేసిన తలుపుల వెనుక నిద్రరాని రాత్రిళ్ళు.

రాత్రి భోజనాలు ముగిశాయి. డిటెన్యూలను తొందరపెడుతున్నారు. కానిస్టేబుల్స్ గదుల్లోకి వెళ్ళమని. నేను లుంగీచెంగుతో మూతి తుడుచుకొని మంచం ఎక్కాను. దిండు సరిచేసుకొని వెల్లికిలా వాలిపోయాను. ఆ గదిలో ఇంకా అయిదు మంచాలు. ఆ మంచాలపై కూలబడాల్సిన శరీరాలు లోకానికొచ్చాయి.

తలుపు రెక్కలు దగ్గరకు లాగాడు సెంట్రీ.

తాళం చెవి తిప్పి వెళ్ళిపోయాడు.

మరొక్కరోజు చీకటిలో కరిగిపోయింది. చరిత్రలో కలిసి పోయింది. నేను కళ్ళు మూసికొన్నాను. నిద్ర కోసం చేసే ప్రథమ ప్రయత్నం.

షరామామూలే నిద్రరాదు. ఇంటి జ్ఞాపకాలు మౌనభంగ మయిన భేతాళుడు మళ్ళీ చెట్టెక్కినట్లుగా, మనస్సు ఇతర పనుల్లో లగ్నం కాకపోతే మనస్సుపై ఇంటి స్మృతులు వేలాడతాయి. పిల్లల ఆకలి చూపులు - తల్లిదండ్రుల ఏడుపులు-కట్టుకున్న పెళ్ళాం తిట్లు అన్నీ ఒక్కొక్కటే - మెదడు తెరపై సినిమా ప్రారంభం.

ఇక లాభం లేదు. కళ్లు తెరిచాను. ఫ్లోరెసెంట్ దీపాలలో విద్యుత్ ప్రవాహం-గుయ్‌మంటూ శబ్దం. దాని వెలుగులో ముసురుకుంటున్న కీటకాల సవ్వడి. కీటకాలను చప్పరించిన బల్లి 'క్రిష్ణ క్రిష్ణ' అంటూ దైవనామస్మరణ చేస్తోంది..... గోడపై.

సహచరులకేసి చూశాను కళ్ళు తిప్పి.

కిటికి ప్రక్కనున్న బెడ్ - సులోచన రావ్‌ది. టేబుల్ లైటు వేసికొన్నాడు. గడ్డం బ్రష్ చేసుకొంటున్నాడు. షేవింగ్ క్రీమ్‌తో విపరీతంగా తెల్లని నురగ రుద్దుకొని అద్దంలోకి చూసికొంటున్నాడు. రాత్రి వేళ గడ్డం గీసుకోవాల్సిన తొందరేమివచ్చిందో ఏమో?... చాలా విచిత్రమైన మనిషి. రేయింబగళ్ళు దించివుంచిన అతని దోమతెర మంచం అవతల నిశబ్దంగా సీరియస్‌గా మసులుతుంటాడు.... ఆపరేషన్‌లో నిమగ్నుడైన డాక్టర్‌లా.

చూపు మరల్చుకొన్నాను. ఇటువైపు స్టూలుపై క్యారంబోర్డు పెట్టి దాని చుట్టూ రెండు ఈజీచైర్స్ జమచేసి ఆటకు సన్నాహాలు చేస్తున్నారు ఇద్దరు మిత్రులు. ఒకరు రంగారావ్ - రెండవ వ్యక్తి ఆర్.కె. రావ్. వీరి పూర్తి పేరు ఎవరికి తెలియదు. ఆర్.కె. అయిపొయ్యాడు జైల్లో.

ఈజీ చైరులో కాలుమీద కాలువేసుకొని కూర్చున్న ఆర్.కె. కిటికీ బయట నిలబడి ఉన్న సెంట్రిపోలీసుతో పరాచికాలాడు తున్నాడు. వాళ్ళు ముగ్గురూ 'గొల్లు'న నవ్వారు. నవ్వుల తరంగాలు గాలిలో తేలిపోసాగాయి. ఆర్.కె. కంఠం చుట్టూ గళ్ళగళ్ళ మఫ్లర్ - పై గుండీలు విప్పుకొన్న రంగు ఓపెన్ షర్ట్. జుట్టు చెరిగివుంది. పెదవులపైనే వేలాడుతూన్న సన్నని మంగుళూరు బీడీ నుండి ధారాళమైన పొగ పైకిపోతోంది. సినిమాలో విలన్ స్నేహితుడులా వుంటాడు-ఆర్.కె. అందర్నీ నవ్విస్తూ నవ్వుతూ జైలు జీవితపు నిరుత్సాహం దూరం చేస్తాడు ఆర్.కె.

నవ్వులకు అతీతంగా వున్నారు మిగతా ఇద్దరు డిటెన్యూలు.

తలుపు మూలన మంచం, మంచంపై దిండు కానీ దుప్పటికానీ లేవు. వుట్టి మంచంపై ఇద్దరు కూర్చున్నారు. ఒకరు మంచం కోడుపై, మరొకరు గోడ మూలకు ఒరిగి, వాళ్ళ ముఖాలు చాలా సీరియస్‌గా ఉన్నాయి. మూలన కూర్చున్న వ్యక్తికి అండర్‌వేర్ తప్ప మరో అచ్ఛాదన లేదు. సన్నగా ఎర్రతేలులా వున్నాడు. అతని చేతిలో రెండుత్తరాలున్నాయి.

ఒకటి - ఇన్‌ల్యాండ్ కవరు - తెలుగులో వ్రాయబడింది - తన ఇంటివద్ద నుండి వచ్చింది.

రెండవది. మూడు సింహాల రాజముద్ర గల శ్వేత పత్రం. హైద్రాబాద్ నుండి వచ్చింది. అందులో టైపుకొట్టబడిన అక్షరాలు అందంగా, హుందాగా ఉన్నాయి. అది ఉత్తరం కాదు.... ఉత్తర్వు.

మూడు సింహాల గుర్తుతో రాజపత్రం.

"మరేం చేద్దామనుకుంటున్నావ్?" మంచంకోటిపై కూర్చున్న నల్లని స్థూలకాయం అడిగింది.

ఉత్తరం వేలికి చుట్టుకుంటూ నిర్లిప్తంగా అవతలివ్యక్తికి సమాధానమిచ్చాడు.

"ఏమీ అనుకోవటం లేదు"

"మరి మీ అమ్మ సంగతి?"... అవతలి కంఠం రెట్టించింది.

"మా అమ్మ సంగతి. నేనేం చెప్పగలను? చచ్చిపోతే చచ్చిపోనివ్వు. ఆమెకిప్పుడు అరవైపైబడు సంవత్సరాలుండవచ్చు. ఎందుకంటే మా పెద్దన్నకే తలంతా నెరిసిపోయి రెండు పళ్ళు కూడా ఊడిపోయినాయి. మా అమ్మ బతికితే ఇంకొక అయిదారేళ్ళు. ఆ తరువాత ఎట్లాగయినా చచ్చిపొయ్యేదే... చచ్చిపొయ్యే ముసలమ్మకు కళ్ళు కనిపించకపోతే మాత్రం ఏం...? ఇప్పుడు ఈ వయస్సులో కళ్ళు కనపడకపోవటం వలన దేశంలో అందరి ముసలోళ్ళకున్న జబ్బే....

కేవలం వాదనకొరకే వాదిస్తున్నట్లు అతని మాటలు పొడిపొడిగా పేలవంగా వున్నాయి. అతని కళ్ళలో వ్యధ - అసహనం వున్నాయి. తల్లిపట్ల తనకున్న అనురాగాన్ని అవ్యక్తంగా దాచిపెట్టడానికి అతని కళ్ళు ప్రయత్నిస్తున్నాయి.

"మళ్ళీ పెరోల్‌కు అప్లయ్ చెయ్యి". 'రిలీజ్ అన్ పెరోల్' ఒక్కవారం రోజులు దొరికినా చాలు. నాల్గురోజులు ఇంటి వద్ద వుండి వస్తే ముసలోళ్ళకు మనస్సు నెమ్మదిగా వుంటుంది.

వెంకన్నా నువ్వు ఇంత అమాయకంగా మాట్లాడతావనుకోలేదు. ఎద్దు పుండు కాకికి ముద్దన్నట్లు మన బాధలు వాళ్ళకేం దుఃఖం చెప్పు.... మనలాంటి గరీబ్‌గాళ్ళకు పెరోల్ దొరుకుతుందా? డబ్బు, పలుకుబడి, పైరవీ అన్ని హంగులూ వుండాలి... అంతేకాని కేవలం కారణాలుండగానే సరికాదు..."

"అందుకనే నేను 'పెరోల్'కి అసలు అప్లయ్యే చెయ్యదలుచుకోలేదు.... మన గొడు వినిపించుకొనే లం....కొడుకు ఎవడున్నాడక్కడ"... వెంకన్న కళ్ళు పెద్దవిచేసి పళ్ళుకొరుకుతున్నాడు.

క్యారంబోర్డు మధ్యలో బిళ్ళలను గుండ్రంగా అమర్చుతూన్న ఆర్.కె. ఆ మాటలు విని ప్రక్కకు తిరిగాడు.

"ఏమిటి?... అంభయ్యకు పెరోల్ దొరకలేదా?"... అంటూ ఆర్.కె. కుర్చీ నుండి లేచి అంభయ్య మంచం వద్దకు నడిచి ఆ రాజపత్రాన్ని అందుకున్నాడు.

"సెక్రటేరియట్ నుండి వచ్చిందా ఆ లెటర్?"... స్ట్రయికర్ చేతిలో పెట్టుకొన్న రంగారావు ప్రశ్నించాడు.

అవునన్నట్లు తలవూపాడు అంభయ్య.

"అంభయ్య డిటెన్యూ. సెంట్రల్ ప్రిజన్ - వరంగల్".... అడ్రసుతో ప్రారంభించిన ఆర్.కె. పూర్తిగా ఆ ఉత్తరాన్ని చదివాడు...

... తాత్కాలిక విడుదలకై హోమ్ ఇస్తూ ప్రభుత్వంవారికి సమర్పించుకొన్న దరఖాస్తును పరిశీలించితిమి. అందులో చూపబడిన కారణాలు ప్రభుత్వం వారిని సంతృప్తిపరచలేకపోయినవి కాన నీకు తాత్కాలిక శెలవు తిరస్కరించడమైనది... ఇట్లు ఛీఫ్ సెక్రటరీ..." తాను ఇంగ్లీషులో చదివిన అంశాన్ని తెలుగులో తర్జుమా చేశాడు ఆర్.కె. దీర్ఘాలు తీస్తూ.

అతని తెలుగు అనువాదంతో అందరి పెదవులపైన చిరునవ్వులు వెలిగి మళ్ళీ ఆరిపొయ్యాయి.

అర్.కె. చదివిన ఉత్తరాన్ని మంచంపై విసిరాడు నిర్లక్ష్యంగా. ఉత్తరం మధ్యంలో ఉన్న రాజముద్ర రక్తపుబొట్టులా ఎర్రగా మెరుస్తోంది విద్యుత్ కాంతిలో.

"ఒట్టి చెయ్యి చూపటానికి కూడా హంగులుండాలి - రాజముద్రలు, సంతకాలు అన్ని పటాటోపాలు... భలే గమ్మత్తుగా ఉంటుంది మన బ్యూరోక్రసీ..." గడ్డం ముగించుకొన్న సులోచనరావ్ మంచం వద్దకొచ్చి అన్నాడు.

"అరెరె... చాలా ఇబ్బందిలో పెట్టారే నిన్ను అంభన్నా... పాపం మీ అమ్మకు ఎట్టాఉందట. కళ్ళు బాగుచేయించారా లేదా మీ అన్నలు... ఏమైనా మంచి వార్తలొచ్చినయ్యా ఇంటి వద్ద నుండి.... ఏది ఆ ఉత్తరం కూడా ఇటుతే...." అంటూ బీడి చివరిదమ్ములాగి మూలకి విసిరివేశాడు - అర్.కె.

ఉత్తరం.

'రేప్' చేయబడ్డ ఉత్తరం. జైలు సూపరింటెండెంట్‌తో చించబడి, జెయిలర్‌తో చదవబడి ఒక వారం రోజుల తరువాత నలిగి నలిగి అందిన కవరు.

వాళ్లిద్దరి మధ్య కూలబడ్డ అర్.కె. మౌనంగా క్రిందికిపైకీ చదువుతున్నాడు ముఖ కవళికలు మార్చుకొంటూ. ఆపైన లేచి నిలబడి గదిలో అందరికి వినిపించేలా అందరికళ్ళూ చెమ్మగిల్లేలా చదవసాగాడు.

"చిరంజీవి కుమార్డు అంభయ్యకు నీ తల్లిదండ్రులు వ్రాయించిన ఉత్తరమేమనగా... నువ్వు జైల్లో ఉండబట్టి ఇప్పటికి సంవత్సరంన్నర దాటిపోయింది బిడ్డా. నిన్ను ఇంతలో ఇడిసిపెట్టరని ఊరంతా అంటున్నారు. మనూరి పోలీసు పటేలు బుచ్చిరెడ్డిగారు కూడా అదేమాట సెబుతున్నాడు. మిమ్ములను ఇడిసిపెడితే, దొరలను, జమిందారులనూ కతంచేసి పూర్తిగా దుర్మార్గం సేత్తారంట.... అందుకని మిమ్ములను సచ్చేదాకా జైల్లోనే ఉంచుతారట.

నువ్వు మీ అమ్మను సూడాలని పెట్టుకొన్న శెలవు ధరఖాస్తు అయిదారాబాదు నుండి సూర్యాపేట పోలీసు స్టేషన్ కొచ్చి అడ్డించి మళ్ళీ మన తుంగతుర్తి పోలీసు 'టానా'కు వచ్చింది. ఆ విధంగా తంతెలన్నీ దిగుకుంటూ దిగుకుంటూ, వచ్చి వచ్చి మన ఊరి పోలీస్ పటేల్‌కాడికొచ్చి ఆగింది.

నీ అయ్య అమ్మలు నిజంగానే మంచాన పడి ఉన్నారనీ నిన్ను ఇడిసి పెడితే ఊరికేమీ పెమాదం రాదని మన ఊరి పోలీసు పటేలు దొర రాత్తేనేగానీ నిన్నిడిసిపెట్టరట పోలీసోళ్లు. నీ ధరఖాస్తు వచ్చీరాంగానే మన ఇంటికి సుంకరోడ్ని తోలించిండు – పోలీసు పటేలు.

"మీ అంభయ్యను ఇడిసిపెట్టుడు, ఇడిసిపెట్టక పోవుడు... అంతా నా సేతుల్లో పని తెలిసినాదిరా మల్లిగా".... అంటూ మీసాలు దువ్విండు దొర. నేను దొర కాళ్ళు మొక్కిన – ఆ మాట ఇనగానే.

"ముసలిదాన్ని నూసిపోటానికి ఒక్క వారం రోజులు శెలవు మీద ఇడిసిపెట్మని రాయమని బతిమాలినా. ఆయన జర్ర నానిండు. నానినాంక ఆయన ఏం జెప్పిండంటే... "పార్టీలో తిరగటం తప్పయిందనీ, ఇక ముందు ముందు దొరల కిలాఫ్‌లో (వ్యతిరేకంగా) మీటింగులు పెట్టననీ, ఎర్ర జెండా పార్టీలో ముందుముందు తిరగననీ. నీ కొడుకు రాజీనామా కాగితం రాసియ్యాలిరా మల్లిగా" అన్నాడు. అట్టా రాసిత్తేనే తప్ప నిన్ను ఇడిసిపెట్టడానికి ఈలు కాదంట. అట్టా నువ్వు రాసివ్వకుండా నిన్నిడిసిపెట్టమని రాసిత్తే పోలీసోళ్ళతో ఆ దొరకు మాట వత్తదంట. మరి! మన కోసమని ఆ దొరని సిక్కులో ఎందుకు బెట్టాలి కొడకా! మన అక్కర మనది. ఆ పెకారంగా రాసిపంపు.

కడుపులో సల్ల కదలకుండా కాలుమీదకాలు ఏసుకొని కూరుసొనే దొరలకు రాజకీయాలు, పార్టీలు కావాలిగానీ మనకెందుకు చెప్పు. కట్టపడి పనిజేసుకొని కలో, గంజో తాగి బతికేవాళ్ళం మనం. మనకెందుకు చెప్పు. కూలీ, కైకిలీ చేసుకొనేవాళ్ళు ప్యార్టీలుగట్టి పొలంమీద కత్తిగడితే పోలీసోళ్ళు మనలను జైల్లో పెడతారు. రాజ్యం వాళ్ళది. పోలీసోళ్లు వాళ్ళ వాళ్ళు... మనకెందుకు మరి. ఆ కాగితం వాళ్లడిగినట్లు రాసిపంపు.

పోయిన ఉత్తరంలో మీ అమ్మ సంగతి రాయించినాను. నీ కోసం ఏడిసి, ఏడిసి దాని రెండోకన్ను కూడా కనపడకుండపోయింది. ఎవరితో మాట్లాడినా నీమాటే, నువ్వు జైలు నుండి వచ్చే వరకూ మీ అమ్మ బతకదు. నిన్ను జైలు నుండి ఇడిసిపెట్టినాంక 'అమ్మా' అని ఎవరిని పల్కరిత్తావ్.... కాబట్టి ఆ కాగితం రాసి పంపు పోలీసోళ్లు అడిగినట్టుగా. ఇంతే సంగతులు.

ఇట్లు
తండ్రి పెద్దమల్లయ్య

ఉత్తరం చదివిన ఆర్.కె. కనురెప్పలు పైకెత్తాడు-కళ్ళు తుడుచుకుంటూ.

అతని కళ్ళలో వలయాకారంగా తిరుగుతూన్న నీరు కనురెప్పల అంచులపైకి పొర్లసాగింది. మౌనంగా ఉత్తరం మంచంపై పెట్టి తన బెడ్‌వైపు వెళ్లిపొయ్యాడు.

అంతా నిశ్శబ్దం.

వాన వేగం పుంజుకుంది బయట - లైట్లు పొయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నా మేధస్సులోని ఆలోచనాశక్తి స్తంభించిపోయింది. భరింపరాని స్థబ్దత - గది నిండా చికటి. దేశమంతా చీకటి - కుట్రకు అనువైన వాతావరణం - దేశంలో ఏదో మూల కుట్ర జరుగుతూన్న అనుభూతి.

నా వెన్నుపూస నుండి సన్నని ఒణుకు.

గుండెలుపిండే ఆ నైరాశ్యంతో ఎక్కడివాళ్ళు అక్కడే కూర్చున్నారు వెలుగు కోసం నిరీక్షిస్తూ.

"మరి అండర్‌టేకింగ్ ఇస్తావా?...." వెంకన్న బొంగురు కంఠం ప్రశ్నిస్తోంది.

"నేనా"?... ఆవేశంతో కంగుమంది అవతలి గొంతు.

"........."

"అండర్‌టేకింగ్ ఇచ్చేవాడ్నయితే ఎప్పుడో ఇచ్చేవాడ్ని వెంకన్నా. తెలిసిందా? ఈ కష్టాలు ఆలోచించకుండనే, నేనీ ఉద్యమంలోకి రాలేదు...." అంటూ అంభయ్య గట్టిగా ఊపిరి పీల్చుకొని మళ్ళీ ప్రారంభించాడు.

"వెంకన్నా జైలు జీవితం విప్లవకారుని జీవితంలో మొదటి పరీక్ష మాత్రమే. ఈ పరీక్షకు తట్టుకోలేనివాడు యిక ఉద్యమాలకు పనికిరాడు. తెలిసిందా?... ఎత్తయిన గోపురం ఎక్కిన వ్యక్తి అక్కడ్నించి క్రిందకు చూస్తూ కళ్ళు తిరుగుతున్నట్లనిపిస్తాయి. కళ్ళు తిరిగిన వ్యక్తి భయపడి ఒక్క మెట్టు క్రిందకు దిగుతాడు ముందు. దిగటం ప్రారంభించన వ్యక్తి ఆ రెండవ మెట్టు పైననే ఉంటాడని గ్యారంటీ ఏమీలేదు.... చివరిమెట్టు దాకా దిగుతాడు.. బాగా ఆలోచించు... అదే విధంగా రాజకీయ ఉద్యమాలు కూడా ఉన్నత

శిఖరాలవంటివి. యీ ఉన్నత శిఖరాన్ని అధిరోహించిన పిదప ఉద్యమం యొక్క లోతులూ, లోయలూ కనిపిస్తాయి. ఆ లోయల్లో సంచరించే పెద్ద పులులను, చిరుతపులులను, తోడేళ్ళను మొదలైన వన్యమృగాలను చూసి భయపడేవాడు ఉద్యమకారుడు కాలేడు. ఉద్యమకారులుగా మనం ఎన్నో హింసలను ఎదుర్కోవాలి. శత్రువు యొక్క బలాలను, హంగులనూ చూసి బెంబేలు పడి రవ్వంత వెనక్కి జరిగినవాడు యిక అక్కడే ఆగడు... ఇటువంటి నిదర్శనలు చరిత్రలో కోకొల్లలు.

కాబట్టి విప్లవకారుని జీవితంలోని ఈ మొదటి పరీక్షను ధైర్యంగా ఎదుర్కోవాలి. జైళ్ళో వుండటానికి భయపడి మా అమ్మనీ, బాపనీ... కొడుకనీ, బిడ్డానీ.... బయటికి పరిగెత్తేవాళ్ళు నకిలీ విప్లవకారులు. ఏ పాలకవర్గాన్ని ప్రజా శత్రువుగా పరిగణించామో ఆ పాలకవర్గ ప్రభుత్వాన్ని క్షమాభిక్ష కోరటంకాన్నా నీచం మరొకటి లేదు... మన వ్యక్తిగతావసరాలనిమిత్తమే ఈసారి ఈ బలహీనతకు తలఒగ్గుతాం. రేపు మరో నీచానికి ఒడిగడతాం... ఎల్లుండి మరో ద్రోహానికి తలబడతాం..."

ఆవేశాన్ని అదుపులో పెట్టుకుంటూ ఆగి ఆగి, గంభీరంగా పలుకుతోంది. అతని గొంతు.

ఇక చాలు అంభన్నా... ఇక చాలు"... చప్పట్లు చరిచాడు ఆర్.కె. ఆనందం, ఉద్రేకం, పట్టలేక... "ఇక వివరణ అవసరం లేదు... మానవుడు పరిస్థితులకు బానిసంటారు. కాదని నీవు ఋజువు చేశావ్... అన్నాడు.

"ఈ లైట్లు ఇంతలో వచ్చేట్టు లేదే?"... ఎంకన్న మాటల్లో విసుగు.

"ఇంకా తొమ్మిదికూడా కాలేదు నిద్ర పోదామంటే... పాటలు పాడుకొందామా ఆర్.కె... లైట్లు వచ్చేవరకూ..." అంటూ తన మిత్రుని మాటకోసం ఎదురుచూడకుండ ఒక్కసారే ఉన్నతస్థాయిలో గొంతెత్తాడు అంభయ్య.

తన గుండెల్లో గూడు కట్టుకొన్న దిగులు తల్లిపట్ల వాత్సల్యం - అండర్‌టేకింగ్ ఇవ్వకూడదనే స్థిరమైన సంకల్పంతో ఘర్షణ పడుతూన్న మనస్సును పెడదారి పట్టించడం కోసమై తన పాట పాడాలనే ఆకస్మిక నిర్ణయానికొచ్చాడని నేను గ్రహించాను.

బండెనక బండికట్టి
పదహారు బళ్ళుకట్టి
ఏ బండిలో వస్తవో కొడుకో
నైజాము సర్కరోడా!...

ఆ పాట - వెంట్రుకలు నిక్కబొడిచే ఆ పాట...

ఎక్కడిది? - ఎన్నటిది?...

దరిదాపు ముప్పయి సంవత్సరాల క్రితం తెలంగాణా గడ్డపై మార్మోగిన విప్లవగీతం.

నైజాం నియంతృత్వానికి వ్యతిరేకంగా, రజాకార్ల దుర్మార్గాలకి వ్యతిరేకంగా తెలంగాణా రైతాంగం గానంచేసిన - మహత్తర జనసంగీతం- విప్లవగీతం.

సాయుధ రైతాంగ పోరాటంతోనే, నియంతృత్వాన్ని అంతమొందించాలన్న సందేశాన్నందించిన - విప్లవగీతం.

గ్రామీణ ప్రాంతంలోని పల్లె ప్రజలందరూ జట్లు జట్లుగా బృందగానం చేసిన - మధురగీతం.

హృదయాలను స్పందింపచేసి పోరాటానికి వెన్నుతట్టిపిలిచిన చైతన్యగీతం.

ఆపాట ముగిసింది.

వెంటనే మరొకపాట.

"సైసైరా... మా జార్జిరెడ్డి.
సైరా... మా జార్జిరెడ్డి"

చాలా ఉద్రేకంగా పాడుతున్నారు వాళ్ళిద్దరూ. ఆకంఠాలలో పాటలు పాడాలనే కోరికలేదు. కేవలం కక్షతో కూడిన ఉద్రేకం. కసినిండిన వాళ్ళ హృదయాలు, వాళ్ల గళాలలో ఒక.అనిర్వచనీయమైన ఉన్మాదాన్ని తెచ్చిపెట్టాయి.

విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని కాంక్షించుతూన్న ఆ విప్లవ గీతాలు, చుట్టూ ఉన్న చీకటిని, కురుస్తూన్న వర్షపు రొదను చీల్చుకుంటూ వెళ్ళి ఆ

జైలు గోడల మధ్య గింగురమని మార్మోగసాగాయి. ఆ రాత్రి అనిర్వచనీయమైన ఆనందంతో వింటూన్న నా మనస్సు మెల్లమెల్లగా నిద్రలోకి జారుకుంది.

.............

సుధీర్ఘమైన రోజులు, మెల్లగా దొర్లిపోతున్నాయి రోడ్డు రోలర్ల్లా. ఒక్కనెల రోజులు గడిచిపొయ్యాయి. ఆ రోజు మధ్యాహ్నం పన్నెండు గంటలు.

డైనింగ్ హాలులో పళ్ళెం కొట్టిన చప్పుడు అంటే భోజనాలకు పిలుపు.

డిటెన్యూలందరూ ఎవరి పళ్ళెం, గ్లాసు వాళ్ళు తీసుకొని డైనింగ్ హాలుకు నడిచారు. అందరూ తిని వెళ్ళిన తరువాత నేనూ, మెస్‌లీడర్ వెంకన్న మిగిలాం. అది రోజూ మా దైనందిన కార్యక్రమం. అందరూ భోజనాలు ముగించుకున్న పిదప తినటం.

పళ్ళెం కడుక్కొని టేబుల్‌పై పెట్టుకుంటూ...

"అందరూ తిన్నారా?".... లాంఛనంగా అడిగాడు.

"అందరూ తిన్నట్లే - ఒక్క అంభయ్య మినహా"... చపాతీలు వడ్డిస్తూ వెంకన్న అన్నాడు.

"అరెరె... ఎందుకని... జ్వరమొచ్చిందా?... పదకొండు గంటలవరకు ఇక్కడ చపాతీలు ఈలపీటపై రుద్దుతున్నాడుగా...? ఉదయం నుండి అన్ని కమ్యూన్‌డ్యూటీస్ చేశాడే... పో... పొయ్యి... పిలుచుకురా!..." అన్నాను.

"నేనువెళ్ళటంకన్నా. మీరు వెళితేనే మంచిది... కమ్యూన్ లీడర్‌గా మీరు రమ్మంటేనే బాగుంటుంది."....

వడ్డించిన పళ్ళెం ప్రక్కకు జరిపి లేచి వెళ్ళాను.

భోజనాలు ముగించుకొన్న మిత్రులు అందరూ కమ్యూనిటీ రేడియోదగ్గర చేరారు - పాటలు వినటానికి. బ్యారక్స్ అన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. మా బ్యారక్ తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి.

తలుపు నెట్టాను.

తలుపు మూలన అంభయ్య మంచం. దానిపైన దిండుకానీ దుప్పటిగానీ లేవు రోజూలాగే. నిండా ముసుగుతో ఉన్న అంభయ్య మూడు పిలుపులకు పలికాడు.

ముసుగుతీసి ప్రశ్నార్థకంగా నాకేసి చూశాడు.

అతను నిద్రపోవటంలేదనీ, మేల్కొనే ఉన్నాడని కళ్ళు చెబుతున్నయి. కళ్ళు ఎర్రగా ఉబ్బనయి. చెంపలు తడితడిగా మురికిగా ఉన్నాయి.

"రా. భోంచేద్దాం.... నీ కోసమే మేమిద్దరమూ ఆగిపొయ్యాం...."

"మీరు తినండి... నాకు ఈ రోజు అన్నం తినబుద్ధికావటం లేదు"– తొలగించిన ముసుగు మళ్ళీ ముఖంపైకి లాక్కున్నాడు.

"అందరమూ తినబుద్ధివేసే తింటున్నామా?... అదొక ఫార్మాలిటీ... కమాన్... గెటప్... లేచెయ్యి" చెయ్యిపట్టుకొనిలేపాను.

ఛాతిమీద పరుచుకున్న ఉత్తరం కనిపించింది. దానిని అందుకని గడపదాటి వెలుగులోకి వచ్చాను. ఉత్తరం విప్పి చదవసాగాను.

ప్రియమైన కుమార్డు అంభయ్యకు తండ్రి పెద్దమల్లయ్య వ్రాయించిన ఉత్తరమేమనగా!

నీ తల్లి శరీరం మంచిగలేదు. ఒగుడాకు లాగయిపోయింది. ఈ నెల రోజుల నుండి నువ్వు రాజకీయాలకు, పార్టీలకు దూరంగా ఉంటానని కాగితంరాసి పంపుతావని ఈ నెలరోజుల నుండి ఎదురు చూసినాము. కానీ నువ్వు ఆ కాగితం పంపలేదు.

మీ అమ్మ సచ్చిపొయ్యేలోగా నువ్వు ఇంటికి రావని మీ అమ్మకు నీ మీద దిగులెక్కువైంది. వాడు ఎటు తిరిగిరాడు... నన్నన్నా వాడి దగ్గరకు తీసుకుపోండని నీ అన్నలిద్దరితోనూ మొరపెట్టు కుంటాంది.

"మీకు తిండి పెట్టడానికే సచ్చిపోతున్నాం... మల్లా వరంగల్ పోటానికి కిరాయిలు యాడకెల్లి తెచ్చిపెట్టాలని 'కస్సు'మన్నారిద్దరూ. వాళ్ళ బతుకులు నీకు తెలుసుగదా! మన దగ్గర మగ మనిషి కూలి ఐదు రూపాయలు. ఐదు రూపాయలకు రెండి కిలోల బియ్యం రావటం లేదు. ఒక్కొక్క అన్నకు ముగ్గురు, నల్గురు పిల్లగాళ్ళు. ఆ కూలి డబ్బులు బియ్యానికే సరిపోవటంలేదు. అందులోకి కూర, నార సంగతి ఆ బగమంతుడికే ఎరుక. కూలి దొరకని రోజున వాన వచ్చిన రోజున పిల్లలు అర్థాకలితోనే మునగడ తీసుకొని పడుంటారు. ఒక్కొక్క

రాత్రి కటిక ఉపవాసం కూడా తప్పడంలేదు. అన్నల బతుకులివి. మరి ఇక వరంగల్లు రావటానికి పైసలు యాడికెల్లి తెచ్చిత్తారు సెప్పు. అందులో ఆ వరంగల్లు దగ్గరా దాపుకాదంట.

నేను మీ అమ్మను నీ వద్దకు తీసుకురావాలంటే ఇంకొక మనిషి తోడుండాలి. ఆమెను ఎత్తి మోటారులో కూసోబెట్టడానికి, దించడానికి మూడో మనిషి తోడు కావాలి. ముగ్గురు మనుషులకు కిరాయిలు కనీసం యాభైరూపాయలన్నా అవతయి.

యాభై రూపాయలంటే, ఇరవై అయిదు కిలోల బియ్యం అంటే ఒక వారం రోజుల గాసం ఒక్కొక్క అన్నకు. ఇది మా బతుకు.

నీకాడికి మేమువచ్చి సూడగలమన్న ఆశలేదు మాకు.

నువ్వే వచ్చి మాకు కనబడిపోతావన్న ఆశ కూడా వదిలేసుకున్నాం.

ఇక మా తిండీతిప్పల సంగతి ఏం రాయాలో తెలియటం లేదు. నీ భాగం క్రిందవచ్చిన ఎకరం చెలకలో జొన్నలు పండితే ఆ జొన్నలతో మమ్మల్నిద్దరినీ సాకమని నువ్వు అన్నలతో చెప్పిపోయినవు. పోయిన సంవత్సరం ఇత్తనాలే తిరిగిరాలేదు. చొప్పమాత్రం ఎల్లింది. ఈ సంవత్సరం అదీలేదు. వాన సందులేకుండా కురిసి, కురిసి, చెలకంతా జాలుపట్టి జొన్నంతా ఎర్రబారిపోయింది.... ఇక మాకు గాసం యాడికెల్లి తెచ్చిపెడతారు నీ అన్నలు. నువ్వు సదువుకొని ముసలితనంలో ఇంత ముద్ద పెడతావనుకొంటే నువ్వు జైలు పాలయితివి బిడ్డా...

నువ్వు ఇంటికాడ ఉంటే నీకు భయపడి మాకింత ముద్ద పడవేసేవాళ్ళు. ఇప్పుడు వాళ్ళను, మా గురించి అడిగే నాధుడే లేడు. ఇప్పటికయితే నీ అన్నలు ఇంటిలోనుండి ఎల్లిపొమ్మనలేదుగానీ, “కంచం కడుక్కొనిరండి...” “బువ్వ పెడతా”మని పిలవటం లేదు... ఇది మా రాత. అందరికీ భారమయి పోయినంక కూడా భగమంతుడు మమ్మల్ని పిలవటం లేదు. మాకోసమని, నువ్వు ఆలోచనలసేసి, సేసి, మనస్సు పాడుచేసకోకు.

నాకు వాపులొచ్చి కాళ్ళు పడిపోయినయి. అనుకోకుండ ఈ రోగమొకటి దాపురించింది.... మీ అమ్మకన్న నేనే ముందెల్లిపోతాననుకుంటా...”

ఉత్తరం చదువుతున్న నా కళ్ళద్దాలు మసకబారిపోయినాయి. అక్షరాలు అస్పష్టంగా కనిపించి ఇక చదవలేకపొయ్యాను. అంభయ్యను ఎలా ఓదార్చాలో తెలియలేదు. కానీ పెద్దమనిషిగా ఏదో ఒకటి మాట్లాడకపోతే బాగుండదనిపించింది.

"పాపం మీ నాన్నకు వాపులు, మీ తల్లిదండ్రుల విషయం తరువాత ఆలోచిద్దాంలే...లే... లేచి ఇంత ఎంగిలిపడు..." చెయ్యిపట్టి లేపబొయ్యాను.

"మా అయ్య–అమ్మ.... తిండిలేక పస్తులు పడుంటే, నాకు తిండి ఎట్టా సహిస్తుంది చెప్పండి...." దుఃఖం పెల్లుబికి మాటలు పూర్తి చెయ్యలేక బాధగా మూల్గేడు. ఇంకా ఏదో అనబోయి గొంతు పెగలక ఆగిపొయ్యేడు. ఏడుపు ముంచుకురాబోతున్నట్లుగా కళ్ళలో నీళ్ళు నిలిచాయి.

నేను ముఖం ప్రక్కకు తిప్పుకొని ఆలోచించాను.

అంభయ్య బి.ఏ. చదువుతుండగా రాజకీయ నిర్బంధానికి గురయ్యాడు. జైల్లో పట్టుదలతో తానే స్వయంగా చదువుకొని బిఏ పాసయ్యాడు కానీ తన సంవత్సరంన్నర జైలు జీవితంలో తల్లి కానీ తండ్రి కానీ, అన్నలూ, అప్పలూ ఎవ్వరూ చూడటానికి రాలేదు.

ఒక్క 'ఇంటర్వ్యూ'కి కూడా నోచుకోని నిర్భాగ్యుడు!

జాలి, సానుభూతితో నా గుండె నిండిపోయింది.

"మరి అంభయ్యా... ఈ జైలు నుండి మనకు విడుదల ఎన్నడోఏమో!... పాపం ముసలి తల్లిదండ్రులు.... కొడుకా... కొడుకా'ని కంటికి ముంటికి ఏకధారగా ఏడుస్తూంటే... 'దేశం... దేశమని...' జైల్లో ఉండటం వలన ప్రయోజనమేముంది?... రాజకీయాలకు దూరంగా ఉంటానని క్షమాభిక్ష కోరుతూ ప్రభుత్వానికి పత్రం రాసివ్వు... ఒక్కనెలరోజులు శెలవుదొరుకుతుంది. పెరోల్ మీద.

పెద్దమనిషి హోదాలో 'స్పానటేనియస్' గా అన్నమాటలు – ఓదార్చటం కోసం.

చిటుక్కున లేచి మంచంపై కూర్చున్నాడు.

అతని కళ్ళల్లో నీళ్ళు ఇంకిపోయి క్రమేపి ఎర్రబడ్డాయి - అగ్ని గోళాల్లా మండిపోసాగాయి.

"నన్ను గూర్చి మీరేమనుకుంటున్నారు? - మీలాంటి పెద్దమనిషి మాట్లాడాల్సిన మాటలు కావివి. మీలాంటి నాయకుల దిగజారుడు పంథా మూలంగానే, గత నలభై ఏళ్లుగా ఈ పార్టీ ఎదుగుబొదుగు లేకుండా ఉంది. క్షమాభిక్షపెట్టమని ఎవరిముందూ చేయిచాచను"....

"అది కాదు.... మరి.... మరి నీ తల్లిదండ్రులు"... నీళ్ళునమలసాగాను.

"ఎవడికిలేరు తల్లిదండ్రులు. ఈ ప్రపంచంలో.... వాళ్లు చచ్చినా సరే.... నేను మాత్రం అండర్‌టేకింగ్ ఇవ్వను"

తలుపులు ఓరగా వేసి ఉన్న ఆ గది నిండా చీకటి.

చీకటిలో అతని రేడియమ్ కళ్ళు - పచ్చగా, ఉద్విగ్నంగా మెరుస్తున్నాయి. ఐదువందల రోజుల నిర్బంధపు కొలిమిలో కాలి కాలి పచ్చగా మెరుస్తున్నాయి. కొన్ని వందల టన్నుల 'పిచ్‌బ్లెడ్'ను వేడిచేసి, చేసి రెండు గ్రాముల రేడియమ్ రూపొందించిన మేరీక్యూరీ ప్రయోగం స్ఫురించింది.

గుండెనిండా జనవేదన నింపుకొన్న త్యాగధనుడు.

త్యాగధనుల ఉన్నత సంకల్పాన్ని అడ్డలేని ఆ జైలు గోడల మధ్య కాలం గడ్డకట్టుకుపోయింది.

**స్వాతి నిర్వహించిన కథల పోటీల్లో ద్వితీయ బహుమతి పొందిన కథ.**

**సేకరణ : "స్వాతి" నవంబర్, 1981 సంచిక**
**సంపాదకులు - వేమూరి బలరామ్**